జీలపల్లిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణం

రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

దర్జాగా కబ్జా..!?

- ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల పాగా
- ఇప్పటికే రెండు గుంటలు,
  - తాజాగా మరో రెండు గుంటలు
- హెచ్చరిక బోర్డు ఉన్నా కొనసాగుతున్న అక్రమ నిర్మాణం


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పెద్దపల్లి, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఖాళీ జాగా ఉంటే చాలు పాగా వేస్తున్నారు. ఇప్పటికే రెండు గుంటల భూమిని కబ్జా చేసి నిర్మాణాలు పూర్తి చేయగా, తాజాగా మరో రెండు గుంటల స్థలంపై కన్నేశారు. 'ఇది ప్రభుత్వ భూమి అని, ఆక్రమణదారులు శిక్షార్హులు అని' రెవెన్యూ అధికారులు బోర్డు పెట్టినా, ఆ బోర్డు ఉన్న స్థలాన్నే కబ్జా చేయడం ఇక్కడ పలు అనుమానాలకు తావిస్తున్నది. వివరాల్లోకి వెళితే.. ఓదెల మండలం జీలకుంటలోని అంబేద్కర్ కూడలి వద్ద సర్వే నంబర్ 563లో 16గుంటల సర్కారు భూమి ఉన్నది. అందులో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 6 గుంటల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించగా, మరో 10 గుంటల స్థలం ఖాళీగా ఉన్నది. ఇది రెవెన్యూ స్థలమని, కబ్జాదారులు శిక్షార్హులని రెవెన్యూ అధికారులు గతంలోనే ఇక్కడ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే ఆ స్థలంలో ఓ ఇద్దరు ఇప్పటికే రెండు గుంటల స్థలాన్ని ఆక్రమించి, నిర్మాణాలు పూర్తి చేసి నివాసముంటున్నారు. తాజాగా మరో రెండు గుంటల స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. బోర్డు స్థలంలోనే నిర్మాణాలను చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల అండతోనే కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పలువురు సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వినతి పత్రం అందించారు. కబ్జాలపై ప్రశ్నిస్తే..? తమపైనే కేసులు పెడుతున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ విషయమై ఓదెల తహసీల్దార్ యాకయ్యను సంప్రదించగా, వివరాలు అందుబాటులో లేవని తెలుసుకొని చెబుతానన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్‌ను సంప్రదించగా, ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ఉద్యోగులు కబ్జా చేస్తున్నారు

అంబేద్కర్ కూడలిలో నా చిన్న నాడే రెండు గుంటల విలువైన స్థలం కబ్జాకు గురైంది. అప్పుడు ఇద్దరు ఉద్యోగులే ఆక్రమించారు. మిగిలి ఉన్న భూమిని సైతం వారు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తే గ్రామస్తులంతా వెళ్లి అడ్డుకున్నారు. అక్కడ చేపట్టిన నిర్మా ణాలను నిలిపివేయించారు. తమ నిర్మా ణాన్ని అడ్డుకున్నారని ఆక్రమణదారులే కేసు పెట్టారు.ముగ్గురిపై కేసు అయింది. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి

-దార సతీశ్, జీలకుంట

ఇది అన్యాయం

విలువైన సర్కారు భూమిని కబ్జా చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే కేసులు పెట్టిస్తున్నారు. కొంత మంది బలంతో, డబ్బుతో ఇలా చేస్తున్నారు. తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చినా.. కలెక్టర్‌కు ఇచ్చినా చర్యలు తీసుకుంటలేరు. ఇక్కడ సర్వే చేయాలే. సర్కారు భూమిని బయటికి తీయాలే. అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలే. ఏమన్నా ఉంటే పేదోళ్లకు సాయం చేయాలే.

- గడ్డం భూమక్క, జీలకుంట

బియ్యం లారీ అడ్డగింత

ఓదెల, డిసెంబర్ 16: బియ్యం లోడుతో వెళ్తున్న లారీని నాంసానిపల్లిలో కొందరు రేషన్ బియ్యంగా భావించి అడ్డుకున్నారు. నాంసానిపల్లి గ్రామం వద్ద లారీని ఆపి పీడీఎస్ బియ్యంగా అనుమానించారు. వారు బియ్యానికి సంబంధించిన వే బిల్లులు చూపించారు. ఓదెల నుంచి సుల్తానాబాద్ మిల్లుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా స్థానికులు ఇవి రేషన్ బియ్యంగా పేర్కొంటూ సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయా శాఖల అధికారులు గ్రామానికి చేరుకుని లారీని ఠాణాకు తరలించారు. దీని పై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు. లారీలో 29టన్నుల బియ్యం సరఫరా అవుతున్నాయి. కాగా త కొంత కాలంగా రేషన్ బియ్యం బ్లాక్ దందా నడుస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిర్దేశిత లక్ష్యాలు అధిగమించాలి

- ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, డిసెంబర్ 16: పని గంటలు పెంచుతూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు గని వద్ద సోమవారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశంలో జీఎంమాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు పని గంటలు పెంచాలన్నారు. భద్రతతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని చెప్పారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతేగాకుండా నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ అంకితా భావంతో పని చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, ప్రణాళికల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీవో నాగేశ్వర రావు, ఎస్‌వో టూ జీఎం సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఐఈ డీజీఎం చంద్రశేఖర్, ఇన్‌చార్జి పర్సనల్ విభాగాధిపతి గుర్రం శ్రీహరి, ఇన్‌చార్జి మేనేజర్ రమేశ్, సీనియర్ పీవో మతీన్ హుస్సేన్, అధికారులు రవిచంద్ర, విక్రమ్, పిట్ సెక్రటరీలు గంగాధర్, కొమురయ్య, ఇతర అధికారులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కమాన్‌పూర్, డిసెంబర్ 16: మండల కేంద్రంలోని పిల్లిపల్లెకు వెళ్లేదారిలో నూతలగుంట వద్ద గతంలో నిర్మించిన శ్మశాన వాటిక నిరుపయోగంగా మారిందనీ, దీనిని వినియోగంలోకి తీసుకవచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎంపీవో భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ ప్రాంతంలో జంతు కళేబరాలను వేస్తుండడంతో ప్రజల ఆరోగ్యానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందన్నారు. ధోబీబిఘాట్ నిర్మించినా వినియోగంలోకి రావడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, నాయకులు తోట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అవార్డు స్వీకరణ

గోదావరిఖని, డిసెంబర్ 16: గోదావరిఖనికి చెందిన ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు, డీహెచ్‌పీఎస్ నాయకుడు మద్దెల దినేశ్ సోమవారం న్యూఢిల్లీలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు స్వీకరించారు. న్యూఢిల్లీలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకుడు నల్ల రాధాకృష్ణ అవార్డు అందజేశారు.

ప్రజావాణిలో అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్

25లోగా సర్వే పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, డిసెంబర్16: ఈనెల 25 లోగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై సోమవారం అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ తో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను యాప్‌తో సర్వే చేయాలన్నారు. ప్రతి దరఖాస్తు ద్వారానే ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితి గతి తెలిసేలా ఫొటో యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేందర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులు ఎప్పకప్పుడు పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల మరమ్మతు పూర్తి చేయాలి

జిల్లాలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల మరమ్మతు పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 13 బీసీ, 15 ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతు పనులు, మౌలిక వసతుల కల్పన ప్రతిపాదనలు పరిశీలించి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. సమావేశంలో జేడీ సీఈఈ నరేందర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ గిరీష్ బాబు, సీపీవో రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

సుల్తానాబాద్, డిసెంబర్ 16 : పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు అన్నారు. జిల్లా టేబుల్ టెన్నీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్రస్థాయ పోటీలకు పంపనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడం అజయ్, కార్యదర్శి బొల్లి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, గోపీ కృష్ణ, ఇక్బాల్, తిరుపతి, ఆసియా, మధు ఉన్నారు.

పోటీ ఏదైనా అల్ఫోర్స్ విద్యార్థులే ముందంజ

- విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి
- రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఇద్దరి ఎంపిక

విద్యార్థినులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, డిసెంబర్ 16 ః పోటీ ఏదైనా అల్ఫోర్స్ విద్యార్థులే ముందువరుసలో ఉంటున్నారని, మరోసారి రుజువు చేశారనీ అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వీ నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో సుల్తానాబాద్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వై యోగేష్, గోపతి త్రిలోచన్‌వర్మలను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడారు. నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యార్థులకు అన్నీ రంగాల్లో తర్ఫీదు ఇవ్వడంతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణిస్తున్నారని తెలిపారు. గతేడాది ఇదే పాఠశాలకు చెందిన ముస్త్యాల పూజశ్రీ సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రపతి నుంచి అవార్డు తీసుకుని, జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులపై కేసులు ఎత్తివేయాలి

గోదావరిఖని, డిసెంబర్ 16: లగచర్ల రైతులపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసనకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పత్తి క్వింటాలు రూ. 7129

పెద్దపల్లి, డిసెంబర్16: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాలుకు రూ. 7129 పలికింది. సోమవారం 188 మంది రైతులు 734 సంచుల్లో తీసుకవచ్చిన 807 క్వింటాళ్ల పత్తిని వ్యా పారులు కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ 7129, కనిష్ఠ ధర రూ. 5818, మోడల్ ధర రూ. 6937 లభించిందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి దేవరాజు పృథ్వీరాజ్ తెలిపారు.

కాట్నపల్లిలో వైద్య శిబిరం

సుల్తానాబాద్ రూరల్, డిసెంబర్ 16: గర్రెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కాట్నపల్లిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 36 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ అనుమానితుల నుంచి స్పూటం నమూనాలు సేకరించారు. వైద్యులు అనుదీప్, సూపర్ వైజర్లు వెంకటరెడ్డి, రోజా, సురేందర్, ఏఎన్ఎం కవిత, ఆశ కార్యకర్తలు విజయ, లావణ్య ఉన్నారు.

జూలపల్లిలో

కమాన్‌పూర్, డిసెంబర్ 16: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జూలపల్లి యాదవ సంఘం కమ్యూనిటీ భవనంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు 150 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. యాదవ సంఘం సభ్యులు, స్థానిక ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే శిబిరం నిర్వహించామని మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తెలిపారు. యాదవ సంఘం నాయకు లు తిరుపతి, కొమురయ్య, మాదాసి శివ, సాయిశంకర్, రవీందర్, జగన్, తిరుపతి, మాదాసి రాజ్‌కుమార్, హరీశ్, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆదర్శ'లో ఆటల పోటీలు

జూలపల్లి, డిసెంబర్ 16 : అంతర్జాతీయ డిసేబుల్ డే పురస్కరించుకొని పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను సమాన దృష్టితో చూడాలని వక్తలు సూచించారు. ఇక్కడ ఎంఈవో సరస్వతి, ప్రిన్సిపాల్ షాదుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాములు స్మారక స్తూపం కూల్చివేత

కోల్‌సిటీ, డిసెంబర్ 16: రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం సమీపంలోని కార్మిక నేత యు.రాములు స్మారక స్తూపాన్ని కార్పొరేషన్ అధికారులు కూల్చివేయడం సంచలనంగా మారింది. సోమవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో కార్పొరేషన్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయించారు. కార్మిక నాయకుడు యూ రాములు 2004 మార్చి 14న హత్యకు గురయ్యాడు. ఆయన స్మారకార్థం సీపీఐఎంఎల్ నాయకులు 2006లో సప్తగిరి కాలనీకి వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డు పక్కన స్తూపాన్ని నిర్మించారు. వర్ధంతి, జయంతి సందర్భంగా ఏటా స్తూపం వద్ద నివాళులర్పిస్తూ వస్తున్నారు. రోడ్డు వెడల్పు పేరుతో స్థానిక ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు నగర పాలక అధికారులు నోటీసులు లేకుండానే స్తూపాన్ని కూల్చివేయడం స్థానికంగా దుమారం రేపుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్మికుల మనోభావాలను దెబ్బతీశారని యూనియన్ నాయకులు పేర్కొంటున్నారు. ఈ ఘటన ఎక్కడి వరకు దారి తీస్తుందోనని స్థానికంగా చర్చనీయాంశమైంది.

అదనపు కలెక్టర్ బాధ్యత వహించాలి

కార్మిక నేత యూ రాములు స్మారక స్తూపం కూల్చివేసిన సంఘటనకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ అరుణ శ్రీ బాధ్యత వహించాలనీ, ప్రజాప్రతినిధులు చెబితే ఎంతటి దుర్మార్గపు చర్యలకైనా ఒడిగడుతారా అని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి తోకల రమేశ్ ప్రశ్నించారు. ఈ మేరకు రాములు స్మారక స్తూపం కూల్చివేసిన స్థలాన్ని సోమవారం పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ జోక్యం చేసుకొని మరోచోట స్తూపం నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల స్తూపాన్ని కూల్చి చేసి అవమానించిన అదనపు కలెక్టర్‌పై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు శంకర్, వైకుంఠం, గొల్లపల్లి చంద్రయ్య, రాములు, పెండ్యాల రమేశ్, కల్వల రాయమల్లు, నాని, బాబు, తేజేశ్వర్, ఇనుగాల రాజేశ్వర్, పోచమల్లు పాల్గొన్నారు.

స్తూపం కూల్చివేత దుర్మార్గపు చర్య

గోదావరిఖని, డిసెంబర్ 16: కార్మిక నేత యూ రాములు స్మారక స్థూపాన్ని ఆదివారం అర్ధరాత్రి మున్సిపల్ అధికారులు కూల్చివేయడం దుర్మార్గపు చర్య అని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ అభివర్ణించింది. స్తూపం కూల్చివేతను నిరసిస్తూ స్థానిక ఫైలాన్ చౌరస్తా వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే రాజన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ నరేశ్ మాట్లాడారు. రాములు జ్ఞాపకార్థం కార్మిక వర్గం సహకారంతో స్వచ్ఛందంగా నిర్మించిన స్థూపాన్ని మున్సిపల్ అధికారులు అభివృద్ధికి అడ్డుగా ఉందని తొలగించారన్నారు. స్తూపాన్ని తొలగించ వద్దని సీపీఐఎంఎల్ న్యూడె మోక్రసీ ప్రతినిధులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని మండిపడ్డారు. కార్మికులు, ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న అధికారులు ఇప్పటికైనా మరోచోట స్తూపం నిర్మాణానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బీ అశోక్, చిలుక శంకర్, ఎం దుర్గయ్య, బీ బుచ్చయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కొల్లూరి మల్లేశం, పీవైఎల్ నాయకులు సమ్మెట తిరుపతి, సాంబయ్య, రాయమల్లు, గుండు రాజయ్య, నర్సయ్య, ప్రవీణ్, శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మంథని, డిసెంబరు 16: సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక ఫ్రెండ్స్ క్లబ్‌లో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఎసీఎఫ్ జిల్లా కార్యదర్శి, సీఎం కప్ జిల్లా కమిటీ సభ్యుడు కొమురోజు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు హాజరైనట్లు పేర్కొన్నారు. అండర్-15 బాలుర, బాలికల విభాగాల్లో మోక్షిణాథ్, పృథ్వీ, గౌతమ్ సాయి, విశ్వక్సేనా, సాయిగణేశ్వర్, ఆరాధ్య కుస్వాన, వైష్ణవ్‌శ్రీ, లిఖిత, అభిగ్న, వర్ణిక ఎంపికైనట్లు వివరించారు. జూనియర్ యోగా అండర్-10, 18 విభాగంలో తేజస్విని, వైష్ణవ్‌శ్రీ, అక్షిత ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. మంగళవారం రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల బాడ్మింటన్ జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. సెలెక్టర్లుగా పీడీలు విజయ్‌కుమార్, ఎండీ. జావీద్, సమ్మయ్య, ఎండీ ఖాజాబీ వ్యవహరించారు.

సేకరించిన భూముల్లో సాగు చేయవద్దు

ముత్తారం, డిసెంబర్ 16: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండలంలోని ముత్తారం, ఓడేడు, కేశనపల్లి, అడవి శ్రీరాంపూర్, పోతారం, సర్వారం, మైదంబండ, లక్కారం, శుక్రవారంపేటలో సేకరించిన భూముల్లో ఈ పంట కాలం రైతులు సాగు చేయవద్దని మంథని ఆర్డీవో సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 9 గ్రామాల్లో జాతీయ రహదారి నిర్మాణం కోసం భూమి సేకరించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పరిహారం విషయంలో కలెక్టర్ వద్ద ఆర్బిటేషన్ నిర్ణయించినట్లు వివరించారు. ఈ ఆర్బిటేషన్ పరిహారం చెల్లింపు ప్రక్రియ కూడా ప్రారంభమైందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో రహదారి నిర్మాణానికి ఎంపిక చేసిన భూముల్లో రైతులు ఎలాంటి సాగు చేయవద్దని స్పష్టం చేశారు. భూసేకరణలో భాగంగా నేషనల్ హైవే అథార్టీ వారు సంబంధిత గ్రామాల్లో తదుపరి చర్యలు తీసుకుంటారని, రైతులు సహకరించాలని కోరారు.

తమ్ముడి పై అన్న దాడి..

ధర్మారం,డిసెంబర్16: రామయ్యపల్లికి చెందిన మార్క లింగయ్య(60)పై అతని అన్న శంకరయ్యతో పాటు కుమారుడు బాలయ్య సోమవారం దాడికి పాల్పడ్డారు. ఏఎస్ఐ ఎండీ సాబీర్ తెలిపిన వివరాల ప్రకారం..మార్క శంకరయ్య, మార్క లింగయ్య అన్నదమ్ముళ్లు. వీరి మధ్య కొంత కాలంగా భూతగాదా ఉంది. ఈ విషయమై గ్రామంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో తమ్ముడు లింగయ్యపై కోపం పెంచుకున్న అన్న శంకరయ్య, అతని కుమారుడు కలిసి సోమవారం కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో లింగయ్య తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. కుడిచేయి విరిగింది. గాయపడిన లింగయ్యను చికిత్స కోసం కరీంనగర్ దవాఖానకు తరలించారు. లింగయ్య కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కరించాలి

రామగిరి డిసెంబర్ 16 : సింగరేణిలో విజిలెన్స్ పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ కేసులను వెంటనే పరిష్కరించాలనీ బీజేపీ మండలాధ్యక్షుడు మూల్మూరి శ్రీనివాస్ కోరారు. సెంటినరీకాలనీలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సింగరేణి సంస్థలో అన్‌ఫిట్ అయిన కార్మికుల స్థానంలో కారుణ్య నియామకం కింద వారి కొడుకులు లేదా అల్లుడు, బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉన్నా కార్మికులు గతంలో మారు పేర్లతో ఉద్యోగాలు చేశారని సింగరేణి యాజమాన్యం విజిలెన్స్ విచారణకు ఆదేశించడంతో ఆ కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పట్టించుకోకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. కార్మికుల పిల్లలు సింగరేణి కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోవాల్సిన దుస్థితి ఉందన్నారు. తక్షణమే విజిలెన్స్ పెండింగ్ కేసులను పరిష్కరించాలని, లేని పక్షంలో వారందరిని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జాప్యానికి కారణమైన సింగరేణి అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతామని పేర్కొన్నారు.

రేపు క్రీడా పోటీలు

జూలపల్లి, డిసెంబర్ 16 : కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జూలపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం బ్లాక్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు రేశవేని మహేశ్, సందనవేని ఓమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులకు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రూ.4 వేల విలువైన క్రీడా సామగ్రి, మెడల్స్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

పెద్దపల్లి కమాన్/ఫర్టిలైజర్ సిటీ/ రామగిరి డిసెంబర్ 16 : జిల్లాలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ తెలిపారు